ఆ 27 కులాలను బీసీ జాబితాలో కలపొద్దు



మంత్రి ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న గంగపుత్ర సంఘం, బీసీ 'ఏ' కులాల హక్కుల పరిరక్షణ సమితి ప్రతినిధులు

గోల్నాక, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం, బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రతినిధులు శనివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. తెలంగాణలో తీసేసిన 27 కులాలను మళ్లీ కలపకూడదని విన్నవిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ బాగయ్య, గడప శ్రీహరి, కంటే రాంచందర్, జి.మల్లేష్, కొమరయ్య, అంబటి సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శికి సన్మానం



భోలక్‌పూర్‌కు చెందిన టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ సయ్యద్ మోహినొద్దీన్ శనివారం ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ.వేణుగోపాల్‌ను సన్మానించారు. పార్టీ కార్యక్రమాలు వివరిస్తూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కృషిచేస్తున్నామని ఆయనకు తెలిపారు. - (ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి)

వైద్యాధికారికి జిల్లా స్థాయి అవార్డు



కలెక్టర్ హరిచందన చేతులమీదుగా అవార్డు అందుకున్న వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి

ముషీరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యుూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డికి జిల్లా ఉత్తమ వైద్యశాఖ అధికారి అవార్డు వచ్చింది. నేషనల్ డాక్టర్స్ డేను పురస్కరించుకుని శనివారం ఉత్తమ వైద్యశాఖ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ హరిచందన ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు మెమోంటో, సర్టిఫికెట్ అందజేసి, ఘనంగా సన్మానించారు.

సిగాచి మృతులకు రూ.కోటి చొప్పున ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

రాంనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సిగాచి మృతులకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. పరిశ్రమల ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలమడుగు భాస్కర్, ఐఎన్‌టీయూసీ నాయకుడు విజయ్‌కుమార్‌యాదవ్, టీఎన్‌టీయూసీ నేత ఎంకే.బోస్ తదితరులు పాల్గొని మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మా కంపెనీ పేలుడు ఘటనలో 41 మంది మరణించగా 50 మందికిపైగా క్షతగాత్రులయ్యారని, 5 రోజులు గడిచినప్పటికీ 10 మంది కార్మికుల ఆచూకీ దొరకక వారి కుటుంబసభ్యులు విలవిల్లాడుతున్నారని వాపోయారు. అయితే ఆపన్న హస్తం అందించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు.

● చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పాశమైలారంలోని సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన దుర్ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు యాజమాన్యం, ప్రభుత్వం కోటి రూపాయలు, గాయపడిన వారికి రూ.50లక్షల చొప్పున చెల్లించాలని బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన చిక్కడపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం విదేశీ కార్పొరేట్ కంపెనీలకు ఎర్రతివాచీ పర్చడమే కాదు కార్పొరేట్ కంపెనీలు కార్మిక చట్టాలకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నారో లేదో పరిశీలించడానికి ఒక ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మహిళల భద్రతకు పెద్దపీట: సీపీ అవినాష్

హైదరాబాద్‌సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మహిళల భద్రత కోసం ఉమెన్ సేఫ్టీ వింగ్ నిరంతరం పనిచేస్తోందని సీపీ అవినాష్ మహంతి అన్నారు. వారం రోజుల వ్యవధిలో (జూన్ 29 నుంచి జూలై 5 వరకు) కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 154 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారు. మహిళలను, యువతులను వేధిస్తున్న వారిపై, ఆన్‌లైన్‌లో వేధింపులకు గురిచేస్తున్న వారిపై 57 కేసులు నమోదు చేశారు. మహిళల భద్రతపై ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో 85 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గృహహింసకు సంబంధించి మహిళా పోలీస్‌స్టేషన్‌లో 29 ఫిర్యాదులు రాగా వాటిలో 11 మందిపై కేసులు నమోదు చేశారు. మిగతా జంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ బృందం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో దాడులు చేసి వ్యభిచారం చేస్తున్న ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు 9 మంది యువతులను రక్షించారు. ఆపరేషన్ ముస్కాన్ 11లో భాగంగా 74 మంది చిన్నారులను కాపాడిన పోలీసులు, 69 మంది పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై 23 కేసులు నమోదు చేశారు. భరోసా సెంటర్‌లో 31 జంటలకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

శరవేగంగా పార్కు సుందరీకరణ



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంక్, సురభి పార్కులు, టీఆర్‌టీ గ్రౌండ్‌లో ప్రజాభివృద్ధి, సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ద్వారా మంజూరు చేయించిన రూ.25లక్షల అంచనావ్యయంతో జరుగుతున్న ఈ పనులను శనివారం కార్పొరేటర్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోనే డివిజన్‌ను రోల్‌మోడల్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ అబ్దుల్‌సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, ఆనంద్‌రావు, సాయికుమార్, అరుణ్‌కుమార్, జ్ఞానేశ్వర్, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి, ఇనాక్, జనార్ధనమూర్తి

ప్రతి ఒక్కరూ గ్రంథ పఠనం చేయాలి

చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ గ్రంథపఠనం చేయాలని ప్రముఖ సాహితీవేత్త నందిని సిధారెడ్డి అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహంలో భాగంగా సినిమా రచయిత డా.రవీంద్రబాబు రచించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ రంధి నవల అవలోకన గ్రంథ ఆవిష్కరణ సభ శనివారం సాయంత్రం జరిగింది. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిధారెడ్డి మాట్లాడుతూ నవలలు, కథలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని, రంధి నవల ఆత్మవిశ్వాసానికి ప్రతీక అని అన్నారు. ప్రముఖ జర్నలిస్ట్ శంకరనారాయణ, సాహితీ పరిశోధకురాలు సుధారాణి పాల్గొన్నారు. అనంతరం నాట్యగురువు మల్లాదిభావన శిష్యబృందం కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు.

రూ.85లక్షలతో భోలక్‌పూర్ రోడ్ల ఆధునికీకరణ

ఎమ్మెల్యే ముఠా గోపాల్



భోలక్‌పూర్‌లో రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోపాల్, జీహెచ్‌ఎంసీ డీఈ సన్నీ

ముషీరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌లో దశాబ్దాల క్రితం వేసిన రోడ్లు అధ్వానంగా మారడంతో రూ.85లక్షలతో వాటిని ఆధునికీకరించేందుకు సీసీ రోడ్లు వేస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని సిద్దిక్‌నగర్, బంగ్లాదేశ్ మార్కెట్ వీధి, శేఖర్‌రెడ్డి ఆసుపత్రి వీధిలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ డీఈ సన్నీతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... నగరంలోని చార్మినార్ మాదిరి బంగ్లాదేశ్ మార్కెట్‌లో వ్యాపారం కొనసాగుతున్నదని, ఈ ప్రాంతానికి వందలాది మంది ప్రతిరోజూ ప్రజలు వస్తారని తెలిపారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా వెంటనే రోడ్డు పనులు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, రాష్ట్ర మైనార్టీ కమిటీ నాయకులు రహీం, జునేద్‌బాగ్దాదీ, మున్వర్ చాంద్, బీసీ సెల్ డివిజన్ అధ్యక్షుడు ఉమాకాంత్, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, ఆర్ శ్రీనివాస్, డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మగ్బూల్, జబ్బార్, యూత్ కమిటీ అధ్యక్షుడు సాయికుమార్, పార్టీ సీనియర్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, సుమన్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

వినోభానగర్‌లో నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

ముషీరాబాద్ డివిజన్ పార్శిగుట్ట వినోభానగర్‌లో నూతనంగా పునఃనిర్మించిన నల్లపోచమ్మ దేవాలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఆలయ కమిటీ నాయకులు తలారి శ్రీకాంత్ ముదిరాజ్, సత్యనారాయణ బాబు, ప్రభాకర్, హరి, గౌరీశంకర ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి, బీఆర్‌ఎస్ మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తిప్రభాకర్, నాయకులు కిరణ్, చంటి పాల్గొన్నారు.

స్తంభాలకు కొత్త విద్యుత్ తీగలను ఏర్పాటు చేయాలి

ముషీరాబాద్ డివిజన్ వైఎస్‌ఆర్ పార్కు వీధిలో 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు ప్రమాదంగా మారాయని, వాటిని తొలగించి కొత్తవి వేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం వైఎస్‌ఆర్ పార్కు వీధిలో తుప్పుపట్టిన ఐరన్ విద్యుత్ స్తంభాలను తొలగించి, రెండు చోట్ల కొత్తవి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఫిర్యాదు మేరకు స్పందించిన ఎమ్మెల్యే 15 రోజుల్లో నూతన విద్యుత్ కేబుల్‌లను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ పార్కు కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కె.శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పి.శ్రీధర్‌చారి, నాయకులు ముచ్చకుర్తి ప్రభార్, రాజు, భారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోవాలి



అంబర్‌పేటలోని బాధితులకు ప్రభుత్వ సహాయ నిధి చెక్కును అందజేసిన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ అమృత

నల్లకుంట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలు ఆరోగ్య చికిత్సలకు ప్రభుత్వ సహాయ నిధి కోసం హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఎంపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. నల్లకుంట, బాగ్‌అంబర్‌పేట డివిజన్లలోని బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన చెక్కులను శనివారం కిషన్‌రెడ్డి, నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత, బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావుతో కలిసి అందజేశారు. నల్లకుంట డివిజన్‌కు చెందిన వెంకట రామలింగేశ్వరరావు, సునీల్, బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని డీడీకాలనీ నివాసి బానోతు భద్రమ్మ భర్త లక్ష్మణ్‌కు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొవడంతో ప్రభుత్వ సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ ముగ్గురికి రూ.60 వేల చొప్పున చెక్కులను కిషన్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ జోషి, బాగ్‌అంబర్‌పేట డివిజన్ మాజీ అధ్యక్షుడు చుక్క జగన్, ప్రధాన కార్యదర్శి ఏడెల్లి బాలు, నాయకులు పి.గోవర్ధన్‌రెడ్డి, దత్తు ముదిరాజ్, జి.శ్రీనివాస్, సురేష్‌గౌడ్, వెంకటరమణ పాల్గొన్నారు.

అంబర్‌పేట గౌడ సంఘం నూతన కమిటీ



గిరిధర్‌గౌడ్



కృష్ణగౌడ్

రాంనగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట గౌడసంఘం నూతన కమిటీని శనివారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బత్తిని రవీందర్‌గౌడ్, అధ్యక్షుడిగా పంజాల గిరిధర్‌గౌడ్, ప్రధానకార్యదర్శిగా తొలుపునూరి కృష్ణగౌడ్, ఉపాధ్యక్షులుగా నందిపల్లి శ్రీహరిగౌడ్, బండి మల్లికార్జున్‌గౌడ్, రుద్రగొని శ్రీధర్ గౌడ్, మలకపేట సతీష్‌గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా పంజాల మహేష్‌గౌడ్, పంజాల వెంకటేష్‌గౌడ్; కోశాధికారిగా చెరుకు రమణాగౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రంగ ప్రదీప్‌గౌడ్, మారేడ్‌పల్లి రోహిత్‌రాజ్‌గౌడ్ నియమితులైనట్లు ఎన్నికల కమిటీ అధికారులు కె.దశరథ్‌గౌడ్, జి.రాజేందర్ గౌడ్, కె.అంజనదాస్‌గౌడ్, బి.సురేందర్‌గౌడ్, ఓంకార్‌గౌడ్ తెలిపారు.

ఆ ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

రాంనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మౌలిక వసతులు, నాణ్యమైన విద్యను అందించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఫర్ యూ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ జి.శ్రీనునాయుడు, నేత శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ.నవీన్ నికోలస్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఎన్నికల్లో హామీలను అమలు చేయాలి

రాంనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేసి, 2 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని, మహిళలకు రూ.2,500, ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, రుణమాఫీ అందరికీ అందించాలని డిమాండ్ చేశారు. శనివారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ నాయకులు కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, ప్రకాష్ వినోద్ పాల్గొన్నారు.

నేడు హనుమాన్ ఆలయంలో శ్రీనివాసకల్యాణం

చిక్కడపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా శ్రీనివాస కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్నట్లు జవహర్‌నగర్ విజయ మెడికల్ స్టోర్స్ అధినేత, చిక్కడపల్లి ఆర్యవైశ్యసంఘం మాజీ అధ్యక్షుడు శ్రీరాంపండరి తెలిపారు. ఈ వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరుగుతాయని ఆయన శనివారం పేర్కొన్నారు.

31 నుంచి అగ్నివీరుల రిక్రూట్‌మెంట్ ర్యాలీ

అల్వాల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అగ్నివీరుల రిక్రూట్‌మెంట్ ర్యాలీ తేదీలు ఖరారయ్యాయి. ఈనెల 31 నుంచి సెప్టెంబరు 14 వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు రక్షణశాఖ పౌరసంబంధాల అధికారి శివహరినాయక్ తెలిపారు. సికింద్రాబాద్‌లోని ఏవోసీ సెంటర్ జోగిందర్‌సింగ్ స్టేడియంలో ఈ ర్యాలీలు జరగనున్నాయి. ఈ నియామకాల్లో భాగంగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ (జీడీ), అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టులను భర్తీ చేయనున్నారు. జూలై 31న ఉదయం 6 గంటలకు జోగిందర్‌సింగ్ స్టేడియంలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. పలు అథ్లెటిక్స్ రంగాల్లో జాతీయ లేదా అంతర్జాతీయ స్థాయి క్రీడా సర్టిఫికెట్లు అవసరమని తెలిపారు. వివరాల కోసం హెడ్‌క్వార్టర్ ఏవోసీ సెంటర్‌ను లేదా www.joinindianarmy.nic.in ను సందర్శించాలని పేర్కొన్నారు.

ఇంటర్ మొదటి సంవత్సరంలో 470 అడ్మిషన్లు

బర్కత్‌పుర, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 470 అడ్మిషన్లు వచ్చాయని ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి తెలిపారు. ఇంకా అడ్మిషన్లు వస్తున్నాయని, ఈ సంవత్సరం 500 దాటే అవకాశం ఉందన్నారు. క్రీడాకారులు కూడా ఇంటర్‌లో చేరడానికి ముందుకొస్తున్నారని, ఇది శుభపరిణామం అన్నారు. క్రీడాకారులకు పూర్తి ప్రోత్సాహం అందిస్తామన్నారు. శనివారం కళాశాలలో క్రీడాకారులకు ఇంటర్ అడ్మిషన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ ఇంగ్లిష్ మీడియంలో 100 అడ్మిషన్లు, సీఈసీ ఇంగ్లిష్ మీడియంలో 170 అడ్మిషన్లు వచ్చాయని ఇది రికార్డు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు ప్రసాదరావు పాల్గొన్నారు.

మన్యంకొండ హనుమద్దాసు పద్యనాటక ప్రదర్శన

చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పాలమూరు కళావిపంచి సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం త్యాగరాయ గానసభలో మన్యంకొండ హనుమద్దాసు చారిత్రక పద్యనాటక ప్రదర్శన భక్తిని నింపింది. ఈ నాటకాన్ని సంస్థ అధ్యక్షుడు, ప్రముఖ నటుడు గుంపుల సుదర్శన్ రక్తికట్టించారు. రచయిత, కవి, దర్శకులు పల్లేటి కులశేఖర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డుగ్రహీత, ప్రముఖకవి, గాయకుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న ముఖ్యఅతిథిగా హాజరై, నటీనటులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాటక అకాడమి మాజీ చైర్మన్ బాదిమి శివకుమార్, తెలంగాణ నాటక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు తడకమళ్ల రామచంద్రరావు, సాల్వాచారి, లక్ష్మీకాంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలను ప్రదానం చేస్తున్న వంశీ రామరాజు, చెన్నయ్య, వెంకటరెడ్డి

భరద్వాజ, కాంతమ్మ స్మారక పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జ్ఞానపీఠ పురస్కారగ్రహీత డా.రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారం, రావూరి కాంతమ్మ స్మారక సాహిత్య సేవా పురస్కారం ప్రదానసభ శనివారం రాత్రి త్యాగరాయ గానసభలో జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగింది. అనంతపురానికి చెందిన ప్రముఖ రచయిత, సాహితీవేత్త బండి నారాయణస్వామి, ప్రముఖ రచయిత్రి కన్నెగంటి అనసూయకు ఈ పురస్కారాలను వంశీ సంస్థల అధినేత డా.వంశీ రామరాజు, తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధానకార్యదర్శి డా.జె.చెన్నయ్య బహూకరించి, సత్కరించి, ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రావూరి భరద్వాజ, రావూరి కాంతమ్మ ట్రస్ట్ ప్రతినిధి రావూరి వెంకట కోటేశ్వరరావు, జీఎస్‌కే. మాధురి, పెద్దూరి వెంకటదాసు, సంస్థ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి, లయన్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యామగాయత్రి మ్యూజిక్ అకాడమి డైరెక్టర్ చిల్లా శివపార్వతిచే గానవిభావరి జరగగా, శేషభట్టార్ ఆరోహి శరణ్య నృత్యాన్ని ప్రదర్శించారు.

ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం



అంబర్‌పేట నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తంరావును సత్కరిస్తున్న నేతలు

గోల్నాక, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఐక్యమత్యమే బలం...మనమందరం మరింత ఐక్యతతో రాజ్యాధికారం వైపు వడివడిగా అడుగులేద్దామని రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు పుటం పురుషోత్తంరావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు పి.రాం మోహన్‌రావు అధ్యక్షతన శనివారం అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలోని కృష్ణారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన అంబర్‌పేట నియోజకవర్గం మున్నూరుకాపు సంఘం సమావేశంలో పురుషోత్తంరావు ప్రసంగించారు. ఇతర బీసీ కులాల వారితో స్నేహంగా ఉంటూ రాజ్యాధికారమే లక్ష్యంగా, ధ్యేయంగా, క్రమశిక్షణ, దృఢ సంకల్పంతో ముందుకు సాగుదామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా పుటం పురుషోత్తంరావు, ప్రధానకార్యదర్శిగా పెంటయ్య, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా బండి పద్మగా ఎన్నికైన వీరిని అంబర్‌పేట సంఘం నాయకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాంపల్లి జైహింద్, బోనం వీరబాబు, సీహెచ్ శ్రీనివాస్, చెంగలి చంద్రమోహన్, మిరియాల శ్రీనివాస్, ఉప్పు సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావును శనివారం భారీగజమాలతో ఘనంగా సత్కరించారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈ సత్కారం నిర్వహించారు. పూలు, పండ్లతో తయారు చేసిన ఈ గజమాల ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో బీజేపీనేతలు బల్వీర్, క్షీరసాగ్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, లావణ్య, రవియాదవ్, కృష్ణ, రాజు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిన నేతలు

●నల్లకుంట: నల్లకుంట డివిజన్ మాజీ కార్పొరేటర్, బీజేపీ సీనియర్ నాయకుడు వనం రమేష్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్.రాంచందర్‌రావు శనివారం ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లకుంట నుంచి బీజేపీ నేతలు బైక్ ర్యాలీగా తరలివెళ్లారు.

● బర్కత్‌పుర: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన ఎన్.రాంచందర్‌రావును శనివారం శాలువాపూలబొకేతో బీజేపీ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్‌సింగ్ తదితరులు సత్కరించారు.

● గోల్నాక: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్.రాంచందర్‌రావు బాధ్యతలను నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో స్వీకరించే కార్యక్రమానికి పార్టీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు సూదగాని శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని గంగానగర్ నుంచి పార్టీ నాయకులు బైక్‌ర్యాలీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ మాజీ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్, కేసరి నర్సింగ్‌రావుయాదవ్, రాంచందర్, శ్రీరామ్, బి.ఈశ్వర్‌రావు, గాజుల గోపాల్, శ్రీకాంత్, నిరంజన్, సంతోష్‌వర్మ, అరుణ్, రాజశేఖర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

● రాంనగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా శనివారం ప్రమాణస్వీకారం చేసిన ఎన్.రాంచందర్‌రావును రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి కలిసి భారీ గజమాలతో సత్కరించారు.



యువత 'సహకారం'లో భాగస్వాములు కావాలి



విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, మెమోంటోలను ప్రదానం చేస్తున్న అతిథులు

రాంనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): యువత సహకార రంగంలో భాగస్వాములు కావాలని, దేశంలో సహకార రంగానికి అత్యంత ప్రాధాన్యం కల్పిస్తున్నామని టీజీసీయూ చైర్మన్ మనాల మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి 2025 కో-ఆపరేటివ్ సంవత్సరంగా ప్రకటిందని గుర్తు చేశారు. బేగంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిజాం కళాశాల విద్యార్థులకు నెల రోజుల పాటు సహకార సంఘాలు వాటి ప్రాధాన్యంపై శిక్షణ నిర్వహించిన అనంతరం వారికి సర్టిఫికెట్, మెమోంటోలను శనివారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రిజిస్టర్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ తెలంగాణ, కో-ఆపరేషన్ చైర్మన్ సురేంద్రమోహన్ మాట్లాడుతూ సహకార వ్యవస్థ ప్రజల మధ్య ఉన్న అగాధాన్ని తొలగించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ రిజిస్టర్ గురుజాల శ్రీనివాసరావు, టీజీసీయూ ఎండీ కేవీఎస్.అన్నపూర్ణ, నిజాం కాలేజ్ ప్రిన్సిపాల్ ఏవీ.రాజశేఖర్ పాల్గొన్నారు.

దేశసేవలో ఎన్‌సీసీకి ప్రత్యేక గుర్తింపు

కవాడిగూడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): దేశసేవలో ఎన్‌సీసీకి ప్రత్యేక గుర్తింపు ఉందని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ప్రతి విద్యార్థి ఎన్‌సీసీలో చేరి తమ జీవితాన్ని దేశ సేవకు అంకితం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం కవాడిగూడలోని ఇంగ్లిష్ యూనియన్ హైస్కూల్‌లో ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం అనంతరం సర్టిఫికెట్స్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ అధికారులు, శిక్షణ పూర్తి చేసుకున్న ఎన్‌సీసీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ-1 పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. షాదన్ కాలేజ్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, లేక్‌వ్యూ ఎస్ఎస్ పరిధిలో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటలవరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పాలమూరుకు వస్తున్న పరిశ్రమలతో వ్యవసాయ రంగానికి ప్రమాదం: వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నర్సింహారెడ్డి, హరగోపాల్ తదితరులు

రాంనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పాలమూరు జిల్లాకు వస్తున్న పరిశ్రమలతో వ్యవసాయ రంగానికి ప్రమాదం పొంచి ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో వ్యవసాయ రంగాన్ని విచ్ఛిన్నం చేసే పరిశ్రమలకు అనుమతులిస్తూ కార్పొరేట్ కంపెనీల జేబులు నింపుతున్నారని ఆరోపించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల జీవనంపై జరిగిన సదస్సులో పలువురు ప్రముఖులు హెచ్‌సీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మణ్. గడ్డం, పర్యావరణ వేత్త చంద్రశేఖరశర్మ తదితరులు మాట్లాడారు. అనారోగ్యాన్ని తీసుకువస్తున్న పాలకుల తీరుకు వ్యతిరేకంగా కలిసివచ్చే ప్రజా సంఘాలతో ప్రజా ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందని వారుపిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎం.కోదండరాం మాట్లాడుతూ పాలమూరు జిల్లా అభివృద్ధికి ఈ సదస్సులో చర్చించిన అంశాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త బాబురావు, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, రాజేంద్రబాబు, చంద్రశేఖర్, తిమ్మప్ప, రెహ్మాన్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

బర్కత్‌పుర, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్, కాచిగూడ రైల్వే స్టేషన్ల నడుమ శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో 25 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని యువకుడు కాచిగూడ - పూర్ణ డెమో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడి అదృశ్యం



అప్పారావు

బర్కత్‌పుర, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుడు అదృశ్యమయ్యాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మలకపేటలో నివాసం ఉంటున్న అప్పారావు(55) ఈనెల 2వ తేదీన విశాఖపట్నం వెళ్లడానికి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు మధ్యాహ్నం 3 గంటలకు వచ్చాడు. సాయంత్రం 6 గంటలకు మహబూబ్‌నగర్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైలులో వెళ్లాల్సి ఉంది. అతడు రైలు ఎక్కలేదు. ఆరోజు మద్యం సేవించి ఉన్నాడు. ఇంటికి చేరలేదు. దీంతో కుమారుడు విశేష్ శనివారం కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.